
జిత్తులమారి
అడపా చిరంజీవి

# జిత్తులమారి

**కో**ట సింహద్వారం వద్ద బల్లెములను పట్టుకుని కావలి కాస్తున్నారు ద్వారపాలకులు. ఇద్దరు శిలావిగ్రహాల్లా నిలిచి ఉండగా, నలుగురు అటు ఇటు తచ్చాడుతూ పరిసరాలను గమనిస్తున్నారు. కోట బురుజు మీద విచ్చు కత్తులతో కొందరు సైనికులు నిలిచి ఉన్నారు.

అదే గడియలో ఇద్దరు యువకులు కోటను సమీపించారు. కాపలా భటులు బల్లెములతో వారిని అడ్డగించారు. ఒరలో కత్తులు ధరించి వీరుల్లా వున్న యువకుల వైపు అనుమానంగా చూశారు.

“మహారాజా వారిని అత్యవసరంగా కలవాలి” అన్నాడు ముందు నిలిచిన యువకుడు.

“వీల్లేదు... ప్రభువులవారు సభతీరి ఉన్నారు. ఈ సమయంలో ఎవరితోను మాట్లాడరు” అని చెప్పాడు ఓ భటుడు.

"అబ్బే... రాజుగారితో నాలుగంటే నాలుగు మాటలు మాట్లాడి వచ్చేస్తాం!" అన్నాడు రెండో యువకుడు.

"మీరెవరు? రాజుగారితో మీకేమిటి పని?" అని అడిగాడు గున్న ఏనుగులా వున్న రెండో భటుడు.

"అది పరమ రహస్యం... రాజావారికి మాత్రమే చెప్పాలి" అన్నాడు మొదటి యువకుడు.

"ఏదైనా తేడా వస్తే మేము దేవిడీని విడిచిపోవాలి. ఇప్పుడు మిమ్మల్ని పంపించడానికి వీలుపడదు."

"తర్వాత మేము మహారాజుని ఎలాగైనా కలుస్తాము. అప్పుడైనా నువ్వు దేవిడీని విడిచిపోవలసిందే!" అని బెదిరించాడా యువకుడు.

"భలేవాడివయ్యా... నీతో పెద్ద చిక్కు వచ్చింది నాకు! సరే ఇక్కడే వుండండి. ప్రభువుల వారిని కనుక్కుని వస్తాను... ఇంతకీ నీ పేరేమిటి?"

"జయకాంతుడు..." చెప్పాడు మొదటి యువకుడు.

"నాపేరు శరభుడు..." అడగకపోయినా చెప్పాడు రెండో యువకుడు.

గున్న ఏనుగు భటుడు అతి కష్టం మీద శరీరాన్ని కదిల్చి, కోట లోపలికి వెళ్లాడు. ఓ గడియ తర్వాత వచ్చి, "మంత్రిగారి ద్వారా కబురు చేరవేశాను. ప్రభువుల వారు మిమ్మల్ని వెంటబెట్టుకు రమ్మన్నారు" అని చెప్పి ఆ ఇద్దరు యువకిశోరాలను సభలోకి తీసుకువెళ్లాడు.

ప్రజల యోగక్షేమాల గురించి గ్రామాధికారులను ప్రశ్నిస్తున్న మహారాజు ధనపాలుడు మాటలు ఆపి, తనముందు నిలిచిన ఆ యువకుల వైపు సాభిప్రాయంగా చూశాడు.

ఆ ఇద్దరు తలలు వంచి మహారాజుకి అభివాదం చేశారు.

“ఎవరు నాయనా మీరు?” అని సాదరంగా అడిగాడు ధనపాలుడు.

“ప్రభూ! మేమూ మీ ప్రజలమే... సువర్ణముఖి నదీతీరాన వున్న బ్రహ్మపురం నుంచి వచ్చాము... మన అవంతీ రాజ్యక్షేమం గురించి మీకు ఓ హెచ్చరిక చెయ్యాలి..” అంటూ సంశయంగా ఆపేశాడు జయకాంతుడు.

“అదేమిటో చెప్పనిదే ఎలా తెలుస్తుంది?” అంటూ చేసైగ చేశాడు మహారాజు.

“మహాప్రభూ! బహు అరుదుగా నాకు చిత్రమైన కలలు వస్తుంటాయి. అవి నిజమైన సందర్భాలు కూడా వున్నాయి” అని చెబుతున్న జయకాంతుడికి అడ్డువచ్చాడు శరభుడు.

“అవును మహారాజా! మా జయుడికి వీరయ్య అని ఓ తాత వున్నాడు. ఓరోజు ఆయన చనిపోయాడు. ఊరు వూరంతా ఇంటిముందు చేరింది. స్మశానానికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తాత బ్రతుకుతాడని తనకు కల వచ్చిందని, ఆయన భౌతికకాయాన్ని తీసుకువెళ్లొద్దని జయుడు గొడవ చేశాడు. చివరికి అతని మాట మీద మూడు గడియలపాటు తాత శవాన్ని పాడె మీంచి కదిలించలేదు. ఆశ్చర్యకరంగా జయుడు చెప్పిన సంధ్యాసమయంలో వీరయ్య తాత పాడె మీదనుంచి లేచి కూర్చున్నాడు...” అంటూ శరభుడు చెప్పిన మాటలకు సభాసదులంతా ఆశ్చర్యపోయారు.

“అలాగే, మావూరి మోతుబరి వెంకయ్యగారి ఎడ్లబండిని దొంగలు ఎత్తుకుపోతున్నారని ముందుగానే కలగని చెప్పాడు నా మిత్రుడు.

అచ్చంగా అలాగే జరిగింది. తర్వాత దొంగలు కూడా దొరికారు'' అంటూ అతడు చెప్పిన మాటతీరుకు సభలోని వారంతా పగలబడి నవ్వారు.

ధనపాలుడి చేసైగతో సభ సద్దుమణిగింది. ''నువ్వు చెప్పాలనుకున్నది ఏమిటి నాయనా?'' అని ఉత్సుకత కనబరిచాడు మహారాజు. అక్కడ చేరిన ప్రజలు కూడ చెవులు రిక్కించారు.

''గత పౌర్ణమినాటి రాత్రి ఓ చిత్రమైన కల కన్నాను ప్రభూ! ఆ కలలో నాకు రెండు దృశ్యాలు కనిపించాయి... ప్రజలు తమ గోడు వినిపించడానికి మీవద్దకు వచ్చారు. కన్నీళ్లతో మిమ్మల్ని ప్రాధేయ పడుతున్నారు. తమ సమస్య తీర్చకపోతే రాజ్యం వదిలి వెళ్లిపోతామని మీకు విన్నవిస్తున్నారు. ఆ సమస్య ఏమిటో నాకు కలలో కనిపించలేదు. ఇక రెండవ దృశ్యం... మీ ప్రియకుమార్తె యువరాణి మదనమంజరిని నేను వివాహం చేసుకున్నట్టు కల కన్నాను!'' అంటూ జయకాంతుడు మాటలు ముగించకముందే సభలోని ప్రముఖులు, ప్రజలు ఒక్కపెట్టున నవ్వారు.

లిప్తపాటున ధనపాలుడి ముఖం గంభీరంగా మారిపోయింది.

సభాసదులు ఆ యువకులవైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

''నువ్వు చెప్పేదంతా అసాధ్యం... అభూతకల్పన... మా ప్రజలకు ఏ సమస్యలూ లేవు. రాజ్యం సుభిక్షంగా వున్నది... నీ అందం వెనుక, వీరత్వం వెనుక దాగి వున్న కుట్ర ఏమిటో మాకు అంతుపట్టకుండా వున్నది...'' అంటున్న ధనపాలుడి భృకుటి ముడిపడింది.

''మిమ్మల్ని మోసగిస్తే నాకు వచ్చే లాభం ఏమున్నది ప్రభూ! నేను చెప్పేది నిజం...'' అని వినయంగా చెప్పాడు జయకాంతుడు.

"మీరు నమ్ముతారో, నమ్మరో అని నేను సాక్షిగా వచ్చాను మహారాజా!" అని అభినయిస్తూ చెప్పాడు శరభుడు.

విగడియతోపాటు ఆలోచనలో పడిన ధనపాలుడు, "ఎవరక్కడ?" అంటూ చప్పట్లు చరచగానే బిలబిలమంటూ పదిమంది భటులు ముందుకు వచ్చారు.

"ఈ ఇద్దరు మోసగాళ్లనీ చెఱసాలలో పడేయండి. పారిపోయే అవకాశం లేకుండా కట్టుదిట్టమైన కాపలా ఏర్పాటుచేయండి. ప్రస్తుతం వీళ్ల కాకమ్మ కథలు విని విచారణ చేసే అవకాశం కూడ లేదు. వీళ్లు చెఱ నుండి పారిపోతే ఆ బాధ్యత మీదే... మీ తలలు కోటగుమ్మానికి వ్రేలాడదీస్తాను, జాగ్రత్త!" అంటూ సింహాసనం దిగి అంతఃపురంలోకి వెళ్లిపోయాడు. ధనపాలుడు.

జయకాంతుణ్ణి, శరభుణ్ణి పట్టి బంధించారు భటులు.

సభాసదులు చోద్యం చూస్తూ ముక్కున వేలేసుకున్నారు.

❖ ❖ ❖

పక్షం దినములు గడిచాయి.

జయకాంతుడు, శరభుడు చెఱసాలలో మగ్గుతున్నారు. ఒకరోజు చెఱసాలలో మధ్య వున్న ప్రాంగణంలో నేరస్థులు ఆకు దొప్పలతో ఆహారం భుజిస్తున్నారు.

శరభుడు ఓ మూలకు పోయి రాతి గట్టు మీద దిగులుగా కూర్చున్నాడు. సరిగ్గా అప్పుడే రెండు ఆకు దొప్పలలో భోజన పదార్థం పట్టుకుని వచ్చిన జయకాంతుడు అతణ్ణి సమీపించాడు. "ఏమిటి

మిత్రమా! రాజ్యాలు కోల్పోయిన మహారాజులా అలా దిగులుగా కూర్చున్నావెందుకు?'' అన్నాడు.

''దిగులు కాక ఇంకేముంది? అడవి పక్షులకు పడేసినట్టు ఇంత ఆహారం పడేస్తున్నారు. సూర్యుడు కూడ కనిపించని ఈ నేలమాళిగ కారాగృహంలో ఇలా మగ్గవలసిందే కదా! పైగా నాబోటి వాడికి రాజ్యాలు ఏలడం కూడానా!'' నిరాశగా పెదవి విరిచాడు శరభుడు.

అతడి మాటలకు జయకాంతుడు పకపకా నవ్వాడు. ''ఏమో, ఎవరు చూడొచ్చారు. నిజంగానే నీవు రాజ్యాలు ఏలతావేమో! ఇక సూర్యుడంటావా... ఎప్పుడో ఒకప్పుడు మనం విడుదలవ్వక తప్పదు. ఇప్పుడు కాగడాల వెలుతురును చూస్తున్న మనం స్వేచ్ఛగా సూర్యుణ్ణి చూసినప్పుడు పొందే ఆనందం వేరు!''

''చాలు చాల్లేవయ్యా... నీ చాతుర్యంతో నన్ను మభ్యపెట్టాలని చూస్తావు. నీ నవ్వులాటలు కట్టిపెట్టు... అసలే ఆకలితో కడుపు ఎండుకుపోయింది'' అంటూ అతడి చేతుల్లోంచి ఓ ఆకుదొప్పను లాక్కున్నాడు శరభుడు.

''చీకటిని తిట్టుకుంటూ కూర్చుంటే ప్రయోజనం లేదు మిత్రమా! ఎక్కడున్నాసరే ఆనందంగా వుంటే, అదే ఆరోగ్యం...''

జయకాంతుడి మాటలు వినకుండా ఆకుదొప్పలోని ఆహారాన్ని గబగబా తింటున్నాడు శరభుడు.

నేరస్థుల భోజనాలు పూర్తికాగానే వాళ్లని చెఱసాల గదుల్లో బంధించారు రాజభటులు.

ఆకలి తీరిందిగానీ శరభుడికి బాధ తీరలేదు. ''జరగబోయే అనర్థం

గురించి చెబితే రాజు గారు బహుమానం ఇస్తారని తీసుకొచ్చావు మొత్తానికి మన ఇద్దరికీ మంచి బహుమానమే ముట్టింది!"

"ఇలా జరుగుతుందని నేను మాత్రం కలగన్నానా... ఊహించనివి జరిగినప్పుడే గుండెనిబ్బరం చేసుకోవాలి. ధైర్యం వహించు శరభా! ఇక్కడి నుంచి బయటపడే అవకాశం వస్తే ముందుగా నిన్ను విడుదల చేయమని ప్రభువుల వారిని అర్థిస్తాను" నిజాయితీగా అతడన్న మాటలకు శరభుడికి ఆనందంతో నోట మాట రాలేదు. మిత్రుడి చేతులు పట్టుకుని అభిమానంగా చూశాడు.

❖ ❖ ❖

"ఏమిటీ వింత! సుభిక్షంగా, సస్యశ్యామలంగా వున్న మన అవంతీ రాజ్యానికి చేటు సంభవించడమా? నువ్వు విన్నది నిజమేనా?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఓ వటవృక్షం క్రింద తీరుబడిగా కూర్చున్న ఓ వృద్ధుడు.

"నా కళ్లతో నేను చూశాను. మహారాజు సభతీరి వుండగా జరిగింది. ఓ వీర యువకుడు ధైర్యంగా చెప్పాడు. అతను కలగన్నాడట!

ఆ మాటతో ప్రభువుల వారికి కోపం వచ్చింది. కళ్లెర్రజేసి చూసి, ఆ వీర యువకుణ్ణి, అతని వెంట సాక్షిగా వచ్చిన వాణ్ణి చెఱసాలలో తోసేయమన్నారు!" అంటూ తను చూసింది చూసినట్టు అభినయించి చెప్పాడు ఓ యువకుడు.

అక్కడ చుట్టూ చేరిన జనం పగలబడి నవ్వారు.

అంగడి వదిలిపెట్టి వాళ్ల మాటలు వినడానికి వచ్చిన వ్యాపారి

తలపాగా సవరించుకుంటూ, ''మంచిపని జరిగింది... లేకపోతే తగుదునమ్మా అనుకుంటూ ప్రతి ఒక్కడూ రాజుగారికి సలహాలు చెప్పేవాడే! కలగన్నాడట, కల... కాకమ్మ కథలు కథలు చెబితే మనమా నమ్మేది! పైగా మహారాజుకే చెప్పడమా! ఇంత వెర్రిబాగులోడి గురించి ఎప్పుడైనా విన్నామా?'' అంటూ ఉత్సాహంగా మాట కలిపాడు.

''శెట్టిగారూ... సరుకుల కోసం మీ అంగడికి ఎవరో వచ్చారు'' ఓ చిన్నది పరుగున వచ్చి చెప్పింది.

''వస్తే వచ్చారులే, కాసేపు వుండమను...'' అంటూ ఆ చిన్నదాన్ని కసురుకున్నాడు ఆ వ్యాపారి.

''అలా తీసిపారేయకండి శెట్టిగారూ... కలలు నిజమైన ఘటనలు అక్కడక్కడ కొన్ని జరిగాయి...'' అన్నాడు ఆ చర్చ మొదలుపెట్టిన వృద్ధుడు. తన చిన్నతనంలో జరిగిన ఓ సంఘటన గుర్తుచేసుకుని, ''మా తాతగారికి తరచుగా కలలు వస్తూ వుండేవి. వాటిలో కొన్ని నిజమైన సందర్భాలు కూడ వున్నాయి. ఆయనకి నిధి నిక్షేపాలు దొరికినట్టు కల వచ్చేది. అదేవిధంగా ఒకనాడు పొలంలోని ఓ చెట్టు మొదలు వద్ద చీమల పుట్టను తవ్వుతుండగా మాతాతకు నిధి దొరికింది...'' అని చెప్పాడు.

''అవును. కొండయ్య చెప్పిన మాట నిజమే...'' అంటూ ఆ వృద్ధుడి మాటను బలపరుస్తూ సాక్ష్యం చెప్పాడు ఓ రైతు.

''ఇదంతా బాగానే వుంది, యువరాణిని పెళ్లాడినట్టు కల రావడమేమిటి? వీడెవడో మహా జిత్తులమారిలా వున్నాడు. వారసులు లేరని తెలిసి మహారాజునే మోసం చేద్దామని వచ్చాడు'' అన్నాడు మరో

పెద్దమనిషి.

"అందుకు సందేహమా! వాడెవడో గాని పెద్ద పన్నాగం మీదే వచ్చి వుంటాడు" అన్నాడు వ్యాపారి.

"ఏమో, నిజం నిలకడ మీదగాని తెలియదు" అన్నాడు వృద్ధుడు.

కోటలోపల, బయట, నగర మంతటా ఎక్కడ చూసినా ప్రజలు ఇదే వింత వార్తను చెప్పుకుంటున్నారు. ఆ వార్త చుట్టుపక్కల గ్రామాలకు, అవంతీ రాజ్యమంతటా పాకిపోయింది.

❖ ❖ ❖

శరభుడు చెఱసాల జీవితానికి మెల్లగా అలవాటు పడ్డాడు.

"జయా! నువ్వు ఏమైనా అను... సాక్షిగా వుండడం ఎంత ప్రమాదమో నాకు బాగా తెలిసి వచ్చింది" అంటూ చిన్నగా నవ్వాడు.

ఆ మిత్రులున్న చెఱసాల బయట కాపలా కాస్తున్న గున్న ఏనుగు భటుడు గుర్రుగా చూసి, "మిమ్మల్ని సభలోకి తీసుకొచ్చిన నన్ను శిక్షించడానికి, మీకు కాపలాగా పెట్టాడు సైన్యాధిపతి. ఇందులో నా తప్పు ఏముంది చెప్పండి" అన్నాడు.

"కోట బయట కాపలా భటులకు ఒత్తిళ్లు ఎక్కువ, భద్రత తక్కువ. ఇక్కడైతే మాకున్నంత రక్షణ మీకూ వుంటుంది. అందువల్ల మీకు ఇక్కడే సుఖంగా వుంటుంది" అని చెప్పాడు శరభుడు.

"నిజం చెప్పి నా దిగులు పోగొట్టావు. ఈ గడియ నుంచి నువ్వు నాకు ప్రాణమిత్రుడివి!" అంటూ పొట్ట తడుముకున్నాడు గున్న ఏనుగు భటుడు.

“నీ పేరేమిటి?”

“మల్లయ్య...”

“అయితే ఓ సహాయం చేస్తావా మల్లయ్యా?”

“అదేమిటో చెప్పు, నేను చెయ్యగలిగింది అయితే తప్పక చేస్తాను.”

“చెఱసాల తలుపు ఓసారి తియ్యి... కోట బయటికి ఇలా వెళ్లి, అలా వచ్చేస్తాను. ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షులను చూసి కొన్ని యుగాలు గడిచినట్టు వుంది!” అన్నాడు శరభుడు అర్థింపుగా.

“భలేవాడివి, నిన్ను వదిలితే నా పీకల మీదికి వస్తుంది. ఇది తప్ప ఇంకేమైనా అడుగు, చేస్తాను...” అన్నాడు మల్లయ్య ఆశ్చర్యంగా చూస్తూ.

జయకాంతుడు చిన్నగా నవ్వి శరభుడి భుజం తట్టాడు, ధైర్యం చెబుతున్నట్టు.

❖ ❖ ❖

ఉద్యానవనంలో తన చెలికత్తెలతో విహరిస్తూ వున్నది యువరాణి మదన మంజరి. వనమంతా వ్యాపించిన పూల గుబాళింపులు వారి మనోల్లాసాన్ని ఇనుమడింపజేస్తున్నాయి.

కిలకిల మంటూ సందడి చేస్తూ ఆ పరువాల పడుచులు పూల పొదరిండ్ల మధ్య ఆటలాడుతున్నారు.

కాసేపటి తర్వాత అలసి సొలసి వెన్నెల మంటపంలోని చలువరాళ్ల మీద ఆశీనులయ్యారా అందాల ముద్దుగుమ్మలు.

యువరాణి చుట్టూ చేరిన ఇష్టసఖులు వింతైన విషయాలు చెబుతూ ఆమెను ఆశ్చర్యపరుస్తున్నారు. మాటల మధ్యలో గిరిక అనే చెలికత్తె

చెఱసాలలో పడిన ఇద్దరు వీరుల వింత కథను ఆమెకు వినిపించింది.

పెదవులు విడీవిడకుండా ముచ్చటగా నవ్వింది మదనమంజరి. అదే విషయం గురించి ఆలోచిస్తూ ఆశ్చర్యం నుంచి వెంటనే తేరుకోలేకపోయింది. నళిని అనే చెలికత్తె ఇంకేదో చెబుతున్నా ఆమె చెవికి చేరలేదు.

యువరాణికి ఆరాత్రి నిద్ర కరువయింది. ఉదయం కాగానే ఇష్టసఖులు  చుట్టూ చేరి సేవలు చేస్తున్నారుగాని ఆమె మనసు మనసులో లేదు.

మదనమంజరిని ముస్తాబు చేస్తూ నళిని అడిగింది. "ఏమిటమ్మా, ఈ వేళ కాస్త పరధ్యానంగా వున్నారు!"

"రాత్రి నిద్రపట్టలేదా?" ఆమె కళ్లలోకి చూస్తూ ప్రశ్నించింది గిరిక.

"అవునే... నిద్ర దూరమైంది" అన్నది మదనమంజరి.

"అంటే... ఇంకేదో దగ్గరై వుంటుంది" అంటూ నవ్వింది నళిని.

"ఇంకేదో అంటే..." యువరాణి తమాషాగా చూసింది.

"ఎవరైనా రాకుమారుడు మీ కలలోకి వచ్చాడేమో!" అన్నది గిరిక నర్మగర్భంగా.

"మీకు తెలియని రాకుమారుడు నాకు ఎవరున్నారే... నాకు వివాహం చెయ్యాలనే సంకల్పంతో దేశదేశాల నుంచి మా తండ్రిగారు తెప్పించిన చిత్రపటాలేవీ నాకు నచ్చలేదని మీకు తెలుసు కదా!"

"నిన్ను ఆట పట్టించాలని అన్నాము యువరాణీ! నీ మనసు మాకు తెలియనిదా! ఏదో చెప్పాలని ఆగిపోయారు..." అంటూ మాటలు ఆపింది

గిరిక.

"నిన్న నువ్వు చెప్పిన వింత కథ వల్ల నాకు నిద్ర పట్టలేదు"

"ఏ కథ యువరాణీ?"

"చెఱసాలలో పడిన కలల వీరుడి కథ!"

"అయితే..." ఆశ్చర్యంగా చూసింది గిరిక.

" ఆ వీరయువకుణ్ణి ఒకసారి చూడాలని వున్నది!"

"అమ్మయ్యో... ఇంకేమైనా వున్నదా! అయినా ఇదేమి కోరిక యువరాణీ!"

"అదంతా నాకు తెలీదు. ఆ వీరుణ్ణి ఓసారి చూడాలి..." తన మాటకు తిరుగులేదన్నట్టు చెప్పింది మదనమంజరి.

"మీకు ఏదీ అసాధ్యం కాదమ్మా... కానీ మహారాజుగారికి తెలిస్తే?"

"తెలిస్తే తెలిసింది, లేదంటే లేదు... అదంతా నాకు తెలీదు. ఆ వీరుణ్ణి కలుసుకునే ఏర్పాటు చెయ్యి" అని ఆజ్ఞాపించింది యువరాణి.

"తప్పుతుందా చెలీ... తమ ఆజ్ఞకు బద్ధురాలిని" అంటూ నాటకీయంగా చేతులు జోడించి అభివాదం చేసింది గిరిక.

మందనమంజరి, నళిని పకపకా నవ్వారు.

అప్పటికి జయకాంతుడు, శరభుడు చెఱసాలలో పడి ఒక మాసం గడిచింది.

❖ ❖ ❖

"యువరాణీవారు వస్తున్నారు. చెఱసాల తలుపు తెరువు..."

ఆజ్ఞాపించింది గిరిక.

గున్నఏనుగు భటుడు మల్లయ్య ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. "అమ్మా గిరికా... ప్రభువుల ఆజ్ఞ మీరితే మా శిక్షలు ఎలా వుంటాయో నీకు తెలుసు కదా! మీవంటి వారికి ఇది భావ్యమా?" అన్నాడు.

"అధికప్రసంగీ! రాజుగారి మాట ఆ తర్వాత... చెప్పినట్టు వినకపోతే యువరాణీవారే నిన్ను శిక్షిస్తారు. ధైర్యముంటే చూడు, అమ్మాయిగారి చేతిలో చురకత్తి వున్నది. దానికి కాలకూట విషం పూయబడి వున్నది. పోటు పొడవవలసిన అవసరం లేదు. ఒక చిన్నగాటు పెడితే చాలు... రక్తం చివ్వుమని చిందుతుంది. గిలగిల కొట్టుకోవలసిన పనిలేదు. భయపడవలసిన పనిలేదు. కనురెప్పపాటులో ప్రాణం పోతుంది. రాకుమారిని ఎదురిస్తే ఎవరికైనా ఇదే శిక్ష... అటు చూడు..." అంటూ గిరిక గంభీరంగా పలికి, చూపుడువేలుతో మెట్ల వైపు చూపించింది.

అదే గడియలో మదనమంజరి చురకత్తిని, పొడవడానికి సిద్ధంగా వున్న భంగిమలో పట్టుకుని గంభీరంగా చూస్తూ మెట్లు దిగుతున్నది.

మల్లయ్య గజగజా వణికిపోయాడు. అతనితో పాటు కాపలా వున్న మరో నలుగురు భటులూ భయం భయంగా చూశారు.

"గిరికా... ఒకవేళ ఈ విషయం తర్వాత ప్రభువులవారికి తెలిస్తే మా గతి ఏంకాను?" బానపొట్ట మీదుగా చేతులెత్తి యువరాణికి నమస్కరించాడు మల్లయ్య.

"మీకు మాట రాకుండా యువరాణి అడ్డుకుంటారు" అని గిరిక హామీ ఇవ్వగానే మల్లయ్య సంతోషంగా తలవూపి చెఱసాల తలుపులు తెరిచాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jittulamari**

* * *